సాక్షి
బాపట్ల
సోమవారం : 22 : ఏప్రిల్ : 2024



గంగాభవానీకి కాసు పూజలు

మాచవరం: కొత్తగణేశునిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగంగాభవానీ అమ్మవారి దేవాలయాన్ని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం సందర్శించి, పూజలు చేశారు.



వైభవంగా పునఃప్రతిష్ట

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దేవతామూర్తుల పునఃప్రతిష్టను ఆదివారం వైభోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరరావు హాజరయ్యారు.

అమ్మవారికి వెండి చీర, జాకెట్ బహూకరణ



తెనాలి: కూచిపూడిలో గల శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మికి వెండి చీర, జాకెట్‌ను తెనాలికి చెందిన విశ్రాంత ఉద్యోగి దాసరి వెంకటరావు, రచయిత్రి దాసరి శివకుమారి దంపతులు బహూకరించారు.

న్యూస్‌రీల్

నేడు నామినేషన్లు ఇలా... రేపల్లెలో డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ ఈవూరు గణేష్ సోమవారం ఉదయం 9 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నటు పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

అద్దంకిలో చిన హనిమిరెడ్డి



అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా పానెం చిన హనిమిరెడ్డి సోమవారం నామినేషన్ వేయనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. దీనిలో భాగంగా ఉదయం 9 గంటలకు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తారని, అనంతరం పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ ఉంటుందని పేర్కొన్నాయి. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీలోని వివిధ పదవుల్లో ఉన్న నాయకులు హాజరుకావాలని కార్యాలయ వర్గాలు కోరాయి.

వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడిగా గిరిధర్

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌ను పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు ఆదివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవినిచ్చిన సీఎం జగనన్న ఆదేశాలు తూచా తప్పకుండా శిరసావహిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరిని కలుపుకుని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు.

మంత్రి రజిని ఆస్తుల విలువ రూ.6.39 కోట్లు

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి విడదల రజిని ఆమె ఆస్తి వివరాలతో, ఇతర వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. మొత్తం స్థిర, చర ఆస్తులు కలిపి రూ6.39 కోట్లుగా చూపారు. భర్త చరాస్తి విలువ రూ.53.03కోట్లు, కుమారుడు పేరు మీద రూ.27లక్షలు, కుమార్తె పేరు మీద రూ.7లక్షలుగా చూపారు. బంగారం 600గ్రాములు, భర్త పేరు మీద 300గ్రాములు, పిల్లల పేరు మీద 100గ్రాములుగా చూపారు. విద్యార్హత బీఎస్సీగా పేర్కొన్నారు.

నేటి నుంచి డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు

యద్దనపూడి: డీఎడ్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని బోయపాలెం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎం. సుభాని తెలిపారు. కళాశాలలో 2022–24 విద్యా సంవత్సరంలో అభ్యసించే విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు మొదలవుతాయని పేర్కొన్నారు. 22న పెడగాగి ఆఫ్ ఇంగ్లిష్ ప్రైమరీ లెవల్–1, 23న పెడగాగి ఆఫ్ ఈవీఎస్ ఏట్ ప్రైమరీ లెవల్–1, 24న పెడగాగి ఆఫ్ ఎలిమెంటరీ లెవల్ ఆప్షనల్ సబ్జెక్టు, 25న కాంటెంప్రరరీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా –1, 26న ఇంటిగ్రేటింగ్ జండర్ అండ్ ఇన్‌క్లూజివ్ ఫర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, 27న స్కూల్ కల్చర్ లీడర్‌షిప్ అండ్ టీచర్ డెవలప్‌మెంట్ పరీక్షలు ఉంటాయని వివరించారు. 2023–25 విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు అదేరోజు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. 22న పెడగాగి ఆఫ్ మదర్‌టంగ్ (తెలుగు/ఉర్దూ/తమిళం), 23న పెడగాగి ఆఫ్ మాథ్స్ ఎట్ ప్రైమరీ లెవల్ –1, 24న పెడగాగి ఎక్రాస్ కరిక్యులం అండ్ ఐసీటీ ఇంటిగ్రేషన్, 25న చైల్డ్‌హుడ్, చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ అండ్ లెర్నింగ్, 26న సొసైటీ, ఎడ్యుకేషన్ అండ్ కరిక్యులమ్, 27న ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. థర్డ్ సెమిస్టర్ విద్యార్థులు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. గతంలో సబ్జెక్టులు మిగిలిన పోయిన వారు కూడా ఇదే పరీక్ష సమయంలో ఆయా బ్యాచ్‌లతో హాజరై పరీక్షలు రాయవచ్చని ఆయన సూచించారు.

జగనన్న బీమా.. ఆక్వాకు ధీమా

ఆక్వా రైతులకు జగన్ సర్కార్ అండ

- దేశంలో మొదటిసారి ఆక్వాకు ఇన్సూరెన్స్
- ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధుల నుంచి రక్షణ
- ఐదు ఎకరాలలోపు రైతులకు వర్తింపు
- ప్రీమియంలో 20 నుంచి 30 శాతం రాయితీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నదాతలకు అండగా నిలుస్తున్న వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆక్వా రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఒకవైపు రైతులకు దేశీయ మార్కెట్ సృష్టించి ఫిష్ ఆంధ్ర పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దాంతోపాటు ప్రకృతి వైరీత్యాలు, వ్యాధులవల్ల నష్టపోతున్న ఆక్వా రైతుల్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పించింది. దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక ,గుజరాత్ రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా బీమాను అమలు చేస్తుండటం గమనార్హం.

కేంద్రాన్ని ఒప్పించి అమలు

ఇప్పటివరకు రొయ్యల రైతులకు ఇన్స్యూరెన్స్ సౌకర్యం లేదు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో పాటు వివిధ వ్యాధులతో అనూహ్యంగా నష్టం వాటిల్లుతోంది. కొన్నిసార్లు పంట పూర్తిగా దెబ్బతింటోంది. దీంతో రైతులకు పెద్దఎత్తున నష్టం వాటిల్లుతోంది. ఊహించని పరిణామాలతో తీవ్రంగా నష్టపోవడం సహజంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తాజాగా పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. దీనికి కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ వద్ద రిజిస్టర్ అయిన రెండు నుంచి అయిదు ఎకరాలలోపు రైతులు అర్హులు. జిల్లాలో ఏడు వేల మందికి పైగా ఆక్వా రైతులు ఉండగా ఐదు ఎకరాలలోపు రైతులు 4,800 మంది ఉన్నారు. పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నందున రాష్ట్రం మొత్తానికి తొలుత 200 హెక్టార్లకు ఇన్స్యూరెన్స్ అనుమతి ఉంది. ఈ లెక్కన బాపట్ల జిల్లా నుంచి రైతులకు అవకాశం లభించింది. ఎకరాకు రూ. 12 నుంచి 15 వేల వరకూ ప్రీమియం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం 20 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఎస్సీ,ఎస్టీ రైతులకు 30 శాతం రాయితీ కల్పిస్తుంది.

బీమాకు ఎన్ఎఫ్‌డీబీ సహకారం

నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) హైదరాబాద్ , చెన్నై వారి సాంకేతిక సహకారంతో ఆక్వా చెరువులకు ఇన్స్యూరెన్స్ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా అమలు చేస్తున్నారు. ఇందుకోసం ఓరియంటల్, అగ్రికల్చరల్ కంపెనీల్ని ఎంపిక చేశారు. తుపానులు, వరదలు, మబ్బులతో కూడిన వాతావరణం, వ్యాధులతో నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడంలో భాగంగా ఆర్థిక సాయం కల్పించడమే దీని ఉద్దేశం. ఇన్స్యూరెన్స్ కాల పరిమితి 45 నుంచి 180 రోజులు (రైతు అవసరాన్ని బట్టి). జిల్లాలోని అర్హత కలిగిన ఆక్వా రైతులు సాగుకు ముందు జిల్లా మత్స్యశాఖ అధికారుల్ని సంప్రదించి బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.



వ్యాధుల ముప్పు

వాస్తవానికి ఆక్వా రైతులు ఈహెచ్‌పీ, వైట్ స్పాట్, వైట్ గట్టు తదితర వ్యాధులతో సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈహెచ్‌పీతో రొయ్యలో ఎదుగుదల ఆగిపోతుండగా వైట్‌గట్టుతో అన్నవాహిక దెబ్బతింటోంది. ఇక వైట్ స్పాట్‌తో జబ్బుచేసి రొయ్య చనిపోతుంది. వీటితో పాటు విబ్రియో వైరస్‌తో నష్టపోతున్నారు. దీంతో రొయ్యల సాగుకు ఇన్స్యూరెన్స్ కల్పించాలని రైతులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు.

ఏపీ నుంచే అధిక ఎగుమతులు

దేశంలో మన రాష్ట్రంనుంచే అత్యధికంగా ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుండగా 10.50 లక్షల టన్నులు అమెరికా, జపాన్, చైనా, యూరోప్, మిడిల్ ఏషియాలకు ఎగుమతి అవుతోంది. మిగిలిన 1.5 లక్షల టన్నులు స్థానికంగా అవసరాలకు వినియోగిస్తున్నారు.

ఈక్విడార్‌తో ఇక్కట్లు

ఈక్విడార్ దేశంలో రొయ్యలసాగు ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. అక్కడి నుంచి పెద్ద ఎత్తున దిగుబడి వస్తోంది. దీంతో వారు చైనా, అమెరికా తదితర దేశాలకు తక్కువ రేటుకే రొయ్యలను ఎగుమతి చేస్తున్నారు. దీంతో మన దేశంనుంచి ఎగుమతులు చేయడం కష్టంగా మారింది. మన దగ్గర ఒక్క కేజీ రొయ్యల(100 కౌంట్) ఉత్పత్తికి రూ. 270 ఖర్చు అవుతోంది. మార్కెట్ లో మాత్రం అంత ధర రావడం లేదు. కనీసం కిలోకు రూ. 300 వస్తే గానీ గిట్టుబాటు కాదు.



ఫిష్ ఆంధ్రతో స్థానిక మార్కెట్ బలోపేతం

ఎగుమతులతో నష్టాలు వస్తుండటంతో అక్వాకు మార్కెట్ కల్పించి రైతులను ఆదుకొనేందుకు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేసింది. ప్రధానంగా రొయ్యలు, చేపలను అధికంగా ఉపయోగించేలా ప్రభుత్వం విస్తృత ప్రచారం చేసింది. అందులో భాగంగా మండల స్థాయి నుంచి ఫిష్ ఆంధ్ర పేరుతో ఎక్కడికక్కడే రొయ్యలు, చేపల మార్కెట్లను నెలకొల్పింది. కనీసం ఉత్పత్తిలో 50 శాతం స్థానికంగా ఖర్చయ్యేలా చర్యలు చేపట్టింది.

సీం జగన్‌కు ధన్యవాదాలు



ఆక్వా రైతులకు ఇన్స్యూరెన్స్ అవకాశం కల్పించాలని చాలా రోజులుగా అడుగుతున్నాం. ఎట్టకేలకు పైలట్ ప్రాజెక్టుగా స్కీం తెచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. ఇప్పటికే రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ఇన్స్యూరెన్స్ వల్ల అధికంగా సాగుచేస్తున్న మన ప్రాంత రైతులకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఈ స్కీం రైతులందరికీ ఉపయోగ పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– వి. విజయ రాంప్రసాద్, ఆక్వారైతు చిన్నగంజాం

రైతులకు ఎంతో ఉపయోగం



ఆక్వా రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం దేశంలో తొలిసారి పైలట్ ప్రాజెక్టుగా ఇన్స్యూరెన్స్‌ను అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులవల్ల నష్టం జరిగితే అండగా ఉంటుంది. 20 శాతం రాయితీతో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. తొలుత జిల్లాలో 50 మంది రైతులకు చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

– సురేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి, బాపట్ల జిల్లా

జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా అవ్వారు రవి



చీరాల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా చీరాలకు చెందిన అవ్వారు రవి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ బీసీ కమిషన్, మేనిఫెస్టో కమిటీ మెంబర్లగా పనిచేసిన తన తండ్రి అవ్వారు ముసలయ్య వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేస్తున్నారని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. మళ్లీ సీఎంగా జగనన్నను, చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు, రీజినల్ కోఆర్డినేటర్ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఆరు నియోజకవర్గ అభ్యర్థుల తో పాటు సీఎంగా జగనన్నను గెలిపించుకునేందుకు చేనేతలంతా ఐక్యంగా కృషి చేస్తామని రవి పేర్కొన్నారు.

రాష్ట్ర కమిటీలో బాపట్లకు చోటు

బాపట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్ర కమిటీ సెక్రటరీలుగా బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరికి పదవులు దక్కాయి. వీరిలో కొండా శివ ప్రసాద్‌రెడ్డి, అమర్తపూడి రమాదేవి ఉన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

- చంద్రబాబు పాలనలో కరువు కాటకాలు, సంక్షోభాలు
- బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ధ్వజం
- వరహాపురంలో అసెంబ్లీ అభ్యర్థి అశోక్‌బాబుతో కలిసి ఎన్నికల ప్రచారం



వరహాపురంలో ప్రసంగిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు

కొల్లూరు (వరహాపురం) : ప్రజా సంక్షేమ పాలనకు చిరునామా జగనన్న అయితే.. కరువు, కాటకాలతో కూడిన సంక్షోభానికి చంద్రబాబు పాలన నిదర్శనమని బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ పేర్కొన్నారు. ఆదివారం వేమూరు మండలం వరహాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబుతో కలసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెత్తందార్ల చేతిలో కీలుబొమ్మ అయిన చంద్రబాబు నాడు జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల్ని విమర్శించి నేడు వాటినే అమలు చేస్తానని వాగ్దానాలు చేయడాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఆయన ప్రజల్ని మరోమారు మోసగించడానికి విఫలయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మేనిఫెస్టోను సైతం మాయం చేసిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకుల జేబులు నింపుకోవడానికి వీలుగా జన్మభూమి కమిటీల్ని పెట్టి ప్రజలను పీడించిన చంద్రబాబు నేడు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తానంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, మేలు జరిగితేనే ఈ ఎన్నికల్లో ఓటు వేయమని కోరుతున్న దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇతర రాజకీయ పార్టీలను కూడగట్టుకొని ఎన్నికల్లో పోటీకి వస్తున్న చంద్రబాబుకు ప్రజలంతా గుణపాఠం నేర్పాలని కోరారు. వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని కోరారు. తొలుత నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచారంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు ప్రజలు నీరాజనాలు పలుకుతూ స్వాగతం పలికారు. ప్రచారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమంలో వేమూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీపీ యల్లమాటి మోహన్, సొసైటీ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్, తాడికొండ శ్రీనుబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ దాది సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చందోలు డేవిడ్ విజయ్‌కుమార్, దాసరి ముత్తయ్య, గాజుల మోహన్, సజ్జ వాసు, కోగంటి లవకుమార్, విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, కెప్టెన్ శ్రీను పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బీభత్సం

- ఇద్దరికి గాయాలు
- మద్యం మత్తులో డ్రైవర్

అద్దంకి రూరల్: పట్టణంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. ఆదివారం బస్సు ఒంగోలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. అద్దంకిలోని మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై కళామందిర్ సినిమా హాలు వద్ద స్కూటర్‌పై వెళ్తున్న నాగులపాడు గ్రామానికి చెందిన వ్యక్తిని, ఆగి ఉన్న లారీని రాసుకుంటూ వెళ్లింది. బస్సు ఆగకుండా అద్దంకి సమీప గ్రామమైన గోపాలపురం వద్ద ఆగిఉన్న మరో ఆటోను ఢీకొట్టింది. అందులో కూర్చున్న పాలెపోగు శ్రీనివాసరావు, వేణులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ ఘటనా స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్‌ను, బస్సును అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే కారణమని స్థానికులు భావిస్తున్నారు. గాయపడిన శ్రీనివాసరావు, వేణులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన నాగులపాడుకు చెందిన వ్యక్తిని ఒంగోలు వైద్యశాలకు తరలించారు.



ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు

ప్రాచీన కావ్యాలపై పునఃసమీక్ష అవసరం



పూర్ణచంద్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు కుటుంబ సభ్యులు

- ప్రముఖ సాహితీవేత్త జీవీ పూర్ణచంద్
- పుట్టంరాజు పురస్కారం ప్రదానం

అద్దంకి: ప్రాచీన కావ్యాల్ని పునఃసమీక్ష చేయాల్సిన బాధ్యత కవులదేనని ప్రముఖ సాహితీవేత్త జి.వి. పూర్ణచంద్ సూచించారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య పురస్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై 'పుట్టంరాజు' పురస్కారాన్ని అందుకున్నారు. మారం వారి సేవాసదన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ మాట్లాడుతూ చిన్నయసూరి అచ్చతెనుగు పదాల్ని తన గ్రంథాల్లో వాడారని చెప్పారు. వాటి అర్థాలు తెలియక ఆయన్ను అపార్థం చేసుకుంటున్నారని, చిన్నయసూరి పదకోశం తయారు చేయడం కోసం పరిశోధన చేస్తున్నట్లు వెల్లడించారు. మంచి కవి కావాలంటే మంచి మంచి గురువులు వరంగా దొరకాలని.. మంచి పుస్తకాలు చదివి ఉండాలని చెప్పారు. పూర్ణచంద్ సాహితీ సేవల గురించి డీవీఎం సత్యనారాయణ వివరించారు. పురస్కార గ్రహీత పరిచయాన్ని వారణాశి రఘురామశర్మ చేశారు. ట్రస్ట్ సేవల్ని అద్దంకి ప్రసన్న వివరించారు. పురస్కార గ్రహీత పూర్ణచంద్ 50 ఏళ్ల సాహిత్య ప్రయాణాన్ని గురించి కేవీ పోలిరెడ్డి వివరించారు.

'ముక్కాల' ప్రత్యేకమైన సాహితీ ప్రక్రియ

పురస్కార గ్రహీత రచించిన 'ముక్కాల' పుస్తకాన్ని గురించి డాక్టర్ యు. దేవపాలన వివరిస్తూ సాహిత్య ప్రక్రియలో లఘు కవిత రూప్రక్రియలు వస్తున్నాయని తెలిపారు. అందులో ముక్కాలు ప్రక్రియకు ప్రత్యేకత ఉందన్నారు. విషయాన్ని మూడు ముక్కల్లో చెప్పడం అంటే మూడు పాదాల్లో కవితాపరంగా ప్రయోగాత్మకంగా, ప్రయోజనాత్మకంగా చెప్పడమని వివరించారు. ఈ మినీ కవితల ద్వారా కవిత్వ లక్ష్యాలను పూర్ణచంద్ చక్కగా వివరించారని చెప్పారు. ఆయన మరో రచన సొంపైన తెలుగు పుస్తకాన్ని ఆర్.వి. రాఘవరావు పరిచయం చేశారు. 'పరువు' పుస్తకం గురించి ఇలపావులూరి శేషతల్ప సాయి 'మరో తెలుగు సూర్యుడు' పుస్తకం గురించి కొండకావూరి కుమార్ సభకు పరిచయం చేశారు. తరువాత పూర్ణచంద్‌ను పూలమాలతో సత్కరించి రూ.10 వేల పురస్కారాన్ని అందజేశారు. సాహితీ మిత్రమండలి పాలకవర్గ సభ్యులు ఆయన్ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఓరుగంటి శ్రీనిదవాసరావు, కుండా సుబ్బారావు, బి.చంద్రశేఖర్, వీరవల్లి రుద్రయ్య, విజయలక్ష్మి, సీహెచ్. మురళీ సుధాకరరావు, వామరాజు వెంకటేశ్వర్లు, కె. శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్ర, సీతారామశాస్త్రి, గాదేపల్లి దివాకరదత్తు, పి.ఎల్. నరసింహారావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, భువనేశ్వరి, సాహిత్యవేత్తలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

టీడీపీ అత్యుత్సాహం

- రాజధాని పర్యటన పేరుతో హడావుడి
- ఎన్నికల్లో సానుభూతి ఓట్ల కోసం పాకులాట
- అమరావతి అభివృద్ధి ప్రణాళిక ధ్వంసం అంటూ ప్రచారం
- 2022లోనే వీటిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసుల నిర్ధారణ



గ్యాలరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని, శ్రావణ్(ఫైల్)

తాడికొండ: టీడీపీ నాయకులు సానుభూతి కోసం పాకులాడుతున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో తమకు ఓట్లు రావనే నిర్ధారణకు వచ్చిన నేతలు హడావుడి చేశారు. ఈ నెల 17వ తేదీన రాజధాని పర్యటన పేరుతో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు చేసిన అమరావతి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన బృహత్తర ప్రణాళికను ధ్వంసం చేశారంటూ ఎల్లో మీడియా, సోషల్ మీడియా, ట్విట్టర్ వేదికగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, రాజధాని రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ఆరోపణలు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం గాలి కొదిలేయడంతో అసాంఘిక శక్తులు ధ్వంసం చేశాయంటూ నానా హంగామా చేశారు. అమరావతిపై కుట్ర జరిగిందంటూ మరికొందరు హడావుడి చేసి ఎల్లో మీడియాలో లేనిది ఉన్నట్లు ప్రచారం చేశారు.

2022లోనే కేసు నమోదు

వాస్తవానికి ఇక్కడ 2022 ఆగస్టులోనే ధ్వంసం జరిగిందంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైం నెంబర్ 203/22, 211/22 పేరుతో కేసులు నమోదు చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ ఈ అశోక్‌గౌడ్ స్వయంగా వెల్లడించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతాన్ని కన్నెత్తి చూడని టీడీపీ నాయకులకు ఒక్కసారిగా అమరావతిపై ప్రేమ ముంచుకొచ్చింది. ఇప్పటికిప్పుడు ధ్వంసం చేసిన ఆనవాళ్లు ఏమీ కనిపించడం లేదని, అందుకు సంబంధించి ఆధారాల సహా తమకు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అశోక్‌గౌడ్ ప్రకటించారు.

గాలి కబుర్లతో రెచ్చగొట్టేందుకే..

అమరావతి రాజధానిని సింగపూర్, జపాన్, మలేషియా, అమెరికాల కంటే పెద్దదిగా అభివృద్ధి చేస్తామని చెప్పి తాత్కాలికంగా చంద్రబాబు పబ్బంగడిపారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతుల కోసం బాబు ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చారు. కౌలు పరిహారం చెల్లించడంతోపాటు భూమిలేని నిరుపేదలకు గత ప్రభుత్వం అందించిన రూ.2,500 పింఛన్‌ను రూ.5,000 చేశారు. రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు మండలంలో 8000 మంది, మంగళగిరి తాడేపల్లి ప్రాంతంలో తొమ్మిది వేల మంది కలిపి మొత్తం 17 వేల మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. వీరంతా సంతృప్తిగా ఉన్నప్పటికీ గాలికబుర్లు చెబుతూ టీడీపీ నాయకులు ఓటమి భయంతో చేస్తున్న అట్టర్ ఫ్లాప్ షోలు చూసి ఓటర్లు నవ్వుకుంటున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు జగదీశ్వరి ఎంపిక



చీరాల టౌన్: 23వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని చీరాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ వై.జగదీశ్వరి రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీలకు ఎంపికైందని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గ్రూపు పరిధిలో నిర్వహించిన రైఫిల్ ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభచూపిన జగదీశ్వరి మే 3 నుంచి 13 వరకు జరిగే ఏపీ, తెలంగాణ ఫైరింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. నర్సరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న జగదీశ్వరి పోటీలకు ఎంపికవ్వడంపై సుబేదార్ మేజర్ ముఖేష్‌కుమార్, సుబేదార్ సత్యంద్రసింగ్, హవల్దార్ మేజర్ రమేష్, ఎన్‌సీసీ ఆఫీసర్ రాజేష్‌లు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



అద్దంకి రూరల్: ఆగిఉన్న ఇటుక ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి మండలంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. దర్శి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బ్రహ్మం చౌదరి కారులో దర్శి నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అద్దంకి మండలంలోని జార్లపాలెం గ్రామ సమీపంలో ఆగిఉన్న ఇటుక లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టటంతో బ్రహ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, మృతుని శరీరంపై తెలుపు, నలుపు రంగు గీతలు కలిగిన పింక్ కలర్ ఫుల్‌హ్యాండ్ షర్ట్, స్కై బ్లూ రంగు కలిగిన జీన్ ప్యాంటు ఉన్నట్లు చెప్పారు. అయితే మృతుని వద్ద ఎటువంటి సమాచారం లభించలేదని, మృతుడి వివరాలు తెలిసినవారు జీఆర్పీ ఎస్ఐ 94406 27646 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

వైఎస్సార్ సీపీతోనే మైనార్టీల అభివృద్ధి

- పార్టీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ
- బాలాజీకి మద్దతు తెలిపిన పలు గ్రామాల ముస్లిం కుటుంబాలు



బాలాజీకి మద్దతు తెలుపుతున్న మార్టూరు మండలం వలపర్ల మైనార్టీ నాయకులు

మార్టూరు: రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీ వర్గాలకు అండగా నిలిచేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని.. ఆ భరోసా కొనసాగడం కోసం మైనార్టీలంతా మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పార్టీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పిలుపునిచ్చారు. మైనార్టీ నాయకులతో చీరాలలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి విప్లవాత్మక చర్యకు నాంది పలికారన్నారు. ఈనేపథ్యంలో నేడు మైనార్టీ యువత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రాణించగలుగుతున్నారని అన్నారు. అదే విధంగా సీఎం జగన్ ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అనేక అవకాశాలను కల్పించి సమాజంలో గౌరవనీయ స్థానం కల్పించారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు 7 సీట్లు ఇవ్వడం ద్వారా మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారని బాలాజీ కొనియాడారు.

చంద్రబాబు పెద్ద మోసకారి..

ఒంటరి పోరాటం చేతకాని చంద్రబాబు ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు సిద్ధమయ్యారని బాలాజీ విమర్శించారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలు తదితర నామినేటెడ్ పోస్టుల్లో మైనార్టీలకు సముచిత ప్రాధాన్యం ప్రస్తుత ప్రభుత్వం కల్పించిన సంగతి ముస్లింలు మరువరని బాలాజీ అన్నారు. షాదీఖానాల నిర్మాణం, ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిదేనని ఆయన గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలు వైఎస్సార్ సీపీ అండగా నిలబడి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. 23వ తేదీ ఎన్నికల నామినేషన్ వేయనున్న సందర్భంగా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, చినగంజాం, పర్చూరు తదితర మండలాలకు చెందిన మైనార్టీ నాయకులు బాలాజీని కలిసి తమ మద్దతు తెలిపారు.

జగనన్న పాలన మెచ్చి చేరికలు



టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన సూరేపల్లి వాసులతో చిన హనిమిరెడ్డి

- సూరేపల్లిలో మరో 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి చిన హనిమిరెడ్డి

బల్లికురవ: మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముక్తేశ్వరం మాజీ సర్పంచి కోణుదుల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూరేపల్లి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి చిన హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలన మెచ్చి ప్రతిరోజూ టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారన్నారు. తమ కుటుంబం ఆరు నెలలుగా అద్దంకి నియోజకవర్గంలో పర్యటిస్తున్నామని ప్రతి గ్రామంలో తమను తమ కుటుంబ సభ్యులుగానే ప్రజలంతా ఆదరిస్తున్నారని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. తాను అద్దంకి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. సోమవారం జరిగే నామినేషన్ కార్యక్రమానికి గ్రామాల వారీగా భారీగా తరలి వచ్చి ఆశీర్వదించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బొంతు వెంకటరావు, శ్రీను, అమర్నాథ్, అర్జున్, గుర్రాల వనమాంజనేయులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతల దాడి

ఒకరికి తీవ్ర గాయాలు, ఇద్దరికి స్వల్ప గాయాలు



మాచర్ల రూరల్: మా పల్లెలో వైఎస్సార్‌సీపీ జెండా కట్టి మాకెదురుగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లడిగేంత దమ్ము, ధైర్యం మీకెక్కడి నుంచి వచ్చిందిరా అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆదివారం మండలంలోని రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే గ్రామంలోని ఎస్‌సి పల్లెలో పేరుపోగు విజయ్‌కుమార్, పొన్నాల సామేలు, పేరుపోగు సుశీల తదితరులు సోమవారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారని కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అదే పల్లెలో అక్కడ ఉన్న టీడీపీకి చెందిన పెనుపాటి అంజి, పెనుపాటి ఏసోబు మాష్టారు, రమేష్, ఉదయ్‌కుమార్, మేరిబాబు, దాసు, చిన ఏసోబులు ఒక్కసారిగా దాడి చేసి వైఎస్సార్ సీపీ తరపున ప్రచారం చేసినా, జెండా పట్టుకున్నా కాళ్లు విరగ్గొడతామంటూ కర్రలతో కొట్టడంతో విజయ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పొన్నాల సామేలు, పేరుపోగు సుశీలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వీరిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి విజయ్‌కుమార్‌ను నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ ఫోన్ పేలి బాలికకు తీవ్ర గాయాలు

చార్జింగ్ పెట్టి వీడియోలు చూస్తుండగా ఘటన



తెగిపోయిన బాలిక చేతివేళ్లు

బెల్లంకొండ: చేతిలోని మొబైల్ ఫోన్ పేలి 11 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపడిన ఘటన పల్నాడు జిల్లా ఎమ్మాజీగూడెం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచాల వెంకటేశ్వరరావు కుమార్తె వీరలక్ష్మి శనివారం సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తర్వాత రోజూ మాదిరిగానే ఇంట్లో ఉన్న తండ్రి స్మార్ట్ ఫోన్ తీసుకుని వీడియోలు చూస్తోంది. చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్ చూస్తుండగా అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో చేతిలో పేలిపోయింది. వీరలక్ష్మి కుడి చేయి, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. చేతి వేళ్లు రెండు పూర్తిగా తెగిపోయి, నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు తరలించారు.

చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల: చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 22వ వార్డు టీడీపీకి చెందిన 100 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఈఐదేళ్లలో చీరాలతో పాటుగా రాష్ట్రంలో జనరంజక పాలన చేసిన జగనన్నను చూసి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. చీరాలలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుంచుకోవడంతో పాటుగా సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించిన జగనన్న పాలనను మళ్లీ తీసుకువచ్చేందుకు అందరం సమష్టిగా పాటుపడాలన్నారు. పార్టీలో చేరినవారిలో రాఘవ, వెంకటరెడ్డి, భాను, రవి, దుర్గ, ఉదయ్, బ్రహ్మారెడ్డి, సాయి, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో వెంకటేష్

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

- చీరాలను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- ఎన్నికల ప్రచారంలో కరణం గీత, ఎమ్మెల్యే కరణం కుమార్తె సుధారాణి



కొత్తపేట శ్రీనివాసకాలనీలో ఓటు అభ్యర్థిస్తున్న కరణం గీత, గోరంట్ల సుధారాణి

చీరాల టౌన్: మరోసారి ఆశీర్వదిస్తే చీరాల నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ సతీమణి కరణం గీత, ఎమ్మెల్యే కరణం కుమార్తె సుధారాణి పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేటలోని మూడురోడ్ల సెంటర్, శ్రీలక్ష్మీ శ్రీనివాస కాలనీ, తదితర ప్రాంతాల్లో కరణం వెంకటేష్‌కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వృద్ధులను, మహిళా ఓటర్లు, నూతన ఓటర్లను పరిచయం చేసుకుని జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలు, పేదవారికి అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందని, ప్రతి పేద కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ద్వారా అర్హులందరికీ మేలు చేకూరుస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఏడో వార్డులో కౌన్సిలర్ యాతం జ్యోతి ఆధ్వర్యంలో వార్డులో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చీరాల్లో జరిగిన అభివృద్ధి ప్రజలు గమనించాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారికి మెరుగైన సేవలందించామన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సుపరిపాలన అందించామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌లు ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకటేష్‌కు, బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, గొర్రెముచ్చు సోని, గట్టు జగదీష్, 10వ వార్డు కౌన్సిలర్, క్లస్టర్–2 మహిళా అధ్యక్షురాలు గోలి స్వాతి, కో–ఆప్షన్ సభ్యురాలు కోడూరి నాగజ్యోతి, షేక్ ఫాతిమా, చీరాల మండల మహిళా అధ్యక్షురాలు శీలం వెంకటేశ్వరమ్మ, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వాసిమళ్ల బ్రదర్స్, మహిళలు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు..

ఆదివారం పేరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ బ్రాంచి చర్చిలో స్త్రీల ఆదివారాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో కరణం గీత, సుధారాణిలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

ఎన్నికల ప్రచారంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి

మేదరమెట్ల: బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని అందులో భాగంగానే సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయమాటలకు మోసపోవద్దని ఆయన ఓటర్లకు సూచించారు. గ్రామంలోని బందిలదొడ్డి సమీపం నుంచి ప్రారంభించిన ప్రచారం ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీల వరకు సాగింది. ప్రచారంలో పాల్గొన్న వైవీని కాలనీల వాసులు పూలమాలలు, హారతులతో సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డిని, ఎంపీ నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, వైస్ ఎంపీపీ జి.నరేష్‌కుమార్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు కోయి అంకారావు, యర్రం రత్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు జజ్జర ఆనందరావు, పేరం నాగలక్ష్మి, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైవీ అభిమానులు పాల్గొన్నారు.

డాక్టర్ దక్షిణామూర్తికి 'ది ప్రైడ్ ఆఫ్ తెనాలి' అవార్డు



డాక్టర్ దక్షిణామూర్తిని ది ప్రైడ్ ఆఫ్ తెనాలి అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: వైద్యోనారాయణో హరిః అనే మాటకు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ప్రతిరూపమని, 'ది ప్రైడ్ ఆఫ్ తెనాలి'తో సత్కరించటం సముచితమని అజో–విభో–కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన సభకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. సంస్థ ఆధ్వర్యంలో ది ప్రైడ్ ఆఫ్ ఇండియా తొలి అవార్డును పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, రచయిత, చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి ప్రదానం చేశారు. కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ డాక్టర్ దక్షిణామూర్తి ఎంత గొప్ప వైద్యులో...అంత గొప్ప మనిషిగా చెప్పారు. దక్షిణామూర్తి నా బిడ్డ అంటూ తెనాలి గడ్డ గర్వంగా చెప్పుకోదగిన వ్యక్తిగా పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, పరిశోధనకుడు ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ దక్షిణామూర్తి జీవిత విశేషాలను వివరించారు.

ఆలోచింపజేసిన 'గో టు హెల్' నాటకం...

సభానంతరం ప్రఖ్యాత నటుడు, రచయిత దివంగత గొల్లపూడి మారుతీరావు రచించిన 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రసఝరి, పొన్నూరు నాటక సమాజం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకానికి రంగస్థల, సినీనటుడు వై.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు. గో టు హెల్ నాటక ప్రదర్శన ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నటించిన చివరి నాటక ప్రదర్శన 'గో టు హెల్' అని, అందులో ఆయన, తాను తండ్రీకొడుకులుగా నటించినట్టు కృష్ణేశ్వరరావు గుర్తుచేసుకున్నారు. నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడారు. వివిధ పాత్రల్లో ఆచార్య అక్కిరాజు సుందర రామకృష్ణ, జి.కుసుమసాయి, ఎస్.సూర్య, ఈ.భాగ్యరాజ్, పి.నాగరాజేష్, బీకేఎస్ఎస్ ప్రసాద్, రూపశ్రీ నటించారు. సంగీతం తబలా బాబు, ఆహార్యం పి.శ్రీధర్, లైటింగ్ సురభి సంతోష్.

ఆరున్నర కిలోల వెండి స్వాధీనం

తెనాలిరూరల్: ఆరున్నర కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పట్టణంలోని ఓ వెండి వస్తువులు తయారు చేసే దుకాణంలో పని చేసే వ్యక్తి విజయవాడ నుంచి శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో వెండిని తీసుకువస్తున్నాడు. తెనాలి మండలం నందివెలుగు ప్రధాన జంక్షను వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు బస్సు తనిఖీ చేశారు. వెండిని గుర్తించి పోలీసులు సీజ్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెండి ఎందుకు, ఎక్కడ నుండి తరలిస్తున్నాడన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని, అన్ని అంశాలను నిర్ధారించుకుని పత్రాలు సరిగా ఉంటే తిరిగి ఇచ్చేస్తామని పోలీసులు తెలిపారు.

పేద బ్రాహ్మణుల వ్యాపార వృద్ధికి సొసైటీ



నగదు చెక్కు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణుల అభ్యున్నతికి రాష్ట్రంలో తొలిసారిగా బ్రాహ్మణ అభివృద్ధి సొసైటీని ఏర్పాటు చేసినట్లు సొసైటీ వ్యవస్థాపకుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఇద్దరు చిరు వ్యాపారులకు రూ.33 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా శివకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందేందుకు రాష్ట్రంలో తొలిసారిగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ ప్రతినిధి శ్రీగిరిరాజు నాగేశ్వరరావు తమ పథకానికి రూ.11 లక్షలు ఆర్థిక సాయం అందించారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సొసైటీ కార్యాలయాలను ఏర్పాటు చేసి, కో ఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు శ్రీగిరిరాజు నాగేశ్వరరావు, కోట సాంబశివరావు, కాశీనాథుని సుబ్రహ్మణ్యం, మేళ్లచెరువు సతీష్, కేవీ పురుషోత్తమరావు, హారిక పాల్గొన్నారు.

రసవత్తరంగా బాస్కెట్ బాల్ పోటీలు



నూజివీడు: పట్టణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ 9వ అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, అనంతపురం జిల్లా జట్లు సెమీస్‌కు చేరాయి. అలాగే బాలుర విభాగంలో లీగ్ పోటీలు ముగిసి క్వార్టర్ ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లోకి తూర్పు గోదావరి, గుంటూరు, కర్నూలు, వైజాగ్, అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జట్లు చేరాయి. కర్నూలు- వైజాగ్ జట్ల మధ్య మ్యాచ్ ముగిసే సమయానికి 48- 48 స్కోర్‌తో సమానంగా నిలవడంతో అదనపు సమయం ఇచ్చి మ్యాచ్ కొనసాగించారు. ఈ ఉత్కంఠ పోరులో వైజాగ్ జట్టు కర్నూలు జట్టుపై 57- 55 స్కోర్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పార్టీ మారి బలిపశువు అయిన జంగా

నరసరావుపేట: గురజాల బీసీ నాయకుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరి బలిపశువు అయ్యారని పలు సంఘాల బీసీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్లమెంటు అభ్యర్థి కార్యాలయంలో బీసీ సంఘీయులు సమావేశం నిర్వహించారు. శనివారం దుర్గి గ్రామంలో నిర్వహించిన టీడీపీ బీసీ సదస్సులో పాల్గొన్న జంగా.. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్‌యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మతోన్మాద పార్టీతో కూడిన కూటమితో కలిసి జంగా బలిపశువు అయ్యారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో ఉండగా పదిమందిలో ఒకడిగా ఉన్నారని, కూటమిలోకి వెళ్లి వందలో ఒకడిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ అనిల్‌కుమార్‌యాదవ్ విజయానికి కృషిచేస్తామని ముక్త కంఠంతో స్పష్టం చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, మహిళా అధ్యక్షురాలు టి.మంగమ్మ అంజియ్య పాల్గొన్నారు.